క్లుప్తంగా

17న మండల పరిషత్ సమావేశం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో పూజారి రామ్మోహన్ మంగళవారం తెలిపారు. ఎంపీపీ మొదలవలస చిరంజీవి అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరు కావాలని సూచించారు.

విజయగణపతికి పూజలు



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో విజయగణపతి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమం నిర్వహించారు.

పాఠశాలలో వార్షిక తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవోలు

ఎచ్చెర్ల: లావేరు మండలం బుడుమూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యాశాఖాధికారులు మంగళవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఎంఈవో-1, 2 ఎల్.ఈశ్వరరావు, మజ్జి మురళీకృష్ణరావు తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. మధ్యాహ్నభోజన పథకాన్ని పరిశీలించారు. రాగి జావను రుచిచూసి సంతృప్తి వ్యక్తపరిచారు. ప్రధానోపాధ్యాయురాలు గుడివాడ ఉమామహేశ్వరమ్మ, సీఆర్‌ఎంటీ మద్దిల రమేష్ ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

జి.సిగడాం: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఆర్.ఉమామహేశ్వరరావు అన్నారు. సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలతో తన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామస్థాయి సమాచారాన్ని ఎప్పటికప్పుడు కార్యాలయానికి అందించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో తప్పుల్లేకుండా చూడాలన్నారు. డీటీలు ఎస్.నిర్మల, గాయత్రి, ఆర్ఐ రామచంద్రరావు ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



పాలఖండ్యాం-సంతవురిటి గ్రామాల మధ్యలో జరుగుతున్న పనులు పరిశీలిస్తున్న అధికారులు

జి.సిగడాం: సంతవురిటి, పాలఖండ్యాం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఎచ్చెర్ల క్లస్టర్ ఏపీడీ కె.లోకేష్, ఎంపీడీవో కె.కృష్ణంరాజు మంగళవారం పరిశీలించారు. వేతనదారులు నిబంధనల మేరకు పనులు చేస్తే మెరుగైన వేతనం గిట్టుబాటు అవుతోందన్నారు. ఏపీవో చోళ్ల సత్యనారాయణ, ఈసీ గేదెల పురుషోత్తంనాయుడు, టీఏలు ఎస్.లక్ష్మణరావు, కీర్తి గణపతి, ఎఫ్ఏ నర్సింగరావు, వాండ్రంగి రాంజీ ఉన్నారు.

అభయాంజనేయునికి ప్రత్యేక పూజలు



స్వామివారి సన్నిధిలో భక్తులు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని అప్పాపురం గ్రామంలోని అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలను చేశారు. వైఎస్సార్‌సీపీ నాయుకులు లుకలాపు అప్పలనాయడు, గ్రామ సర్పంచ్ జగ్గురోతు సత్యన్నారాయణ, తామాడ ఎంపీటీసీ సభ్యుడు రౌతు నారాయణరాజు, జగురోతు రాము, చందక నాగరాజు, మీసాల నారాయణరావు, భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విద్యార్థినుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న 8 మంది విద్యార్థినులు ఇటీవల జరిగిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ఇంటెల్లిపాట్ సంస్థకు రూ.7.25 లక్షల వార్షిక వేతనంతో ఎంపికై శభాష్ అనిపించారు. వీరిని మంగళవారం కళాశాలలో అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్, సెంట్రల్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిశోర్, ఎల్.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ పాలన

- అర్హులందరికీ పథకాలు
- శ్రీవాణి ట్రస్ట్ చెక్కు పంపిణీలో మంత్రి ధర్మాన ప్రసాదరావు



రామమందిర నిర్మాణానికి శ్రీవాణి ట్రస్ట్ చెక్కు అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: అనేక అభివృద్ధి పనులు చేపడుతూ, పేదల పక్షాన ఉంటూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. పెదపాడులోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం గార మండలం బందరువానిపేటలో రామమందిరం నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శ్రీవాణి ట్రస్ట్ నుంచి రూ.10 లక్షల చెక్కును గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ బందరువానిపేటలో 1100 మంది ఇళ్లు అందించామని, పూర్తిస్థాయిలో రహదారులు వేశామని, తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో షెల్టర్లు నిర్మించామని, అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేశామని వివరించారు. పేదల జీవన ప్రమాణాల మెరుగే లక్ష్యంగా అర్హులందరికీ పార్టీలకు అతీతంగా పథకాలు వర్తింపజేశామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ప్రతి హామీని చిత్తశుద్ధితో అమలు చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యుల దోపిడి, దౌర్జన్యాలను ఎన్నో చూశామని, ఏదైనా పథకానికి దరఖాస్తు చేసుకోవాలంటే టీడీపీ నేతల సంతకం ఉంటేనే పని అయ్యేదని గుర్తు చేశారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. గ్రామాల్లోనే సచివాలయ వ్యవస్థ ద్వారా తహశీల్దార్, ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లకుండానే అన్ని ప్రజల చెంతకే పథకాలు అందుతున్నాయని తెలిపారు. మూలపేట పోర్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. మరో తొమ్మిది నెలల్లో బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ పనులు కూడా పూర్తవుతాయన్నారు. అప్పుడు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. ఇవన్నీ జరగాలంటే మనం గెలిపించే ప్రభుత్వాలపైనే ఆధారపడతాయన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఇంట్లో ముగ్గురు పిల్లలున్నా రూ.45వేలు ఇస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నమ్మించి మోసం చేయడమే టీడీపీ ఉద్దేశంగా కనిపిస్తోందన్నారు. పేదల పట్ల నిలబడే ప్రభుత్వానికి ప్రతిఒక్కరూ మద్దతు ఇస్తే భవిష్యత్ తరాలు బాగుపడతాయని మంత్రి పేర్కొన్నారు.

సమగ్రంగా ఓటర్ల జాబితా పరిశీలన



సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

రణస్థలం: మండలంలోని 87 మంది బూత్ లెవెల్ అధికారులు క్షేత్ర స్థాయిలో తుది ఓటర్ల జాబితాను సమగ్రంగా పరిశీలించాలని తహసీల్దార్ ఎల్.రామారావు సిబ్బందికి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నెల 22వ తేదీన ప్రచురించిన తుది ఓటర్ల జాబితాలో మరణించిన ఓటర్లు, రెండేసి ఓట్లు ఉన్నవారు, మరో చోటకు బదిలీ అయిన ఓటర్లను గుర్తించి ఫారం-7లతో పాటు ఓటర్ల వ్యక్తిగత ధ్రువీకరణ పత్రం సమర్పించాలన్నారు. అలాగే ఫొటోల మార్పు, చిరునామా, పేరు, ఇంటి నంబరు మార్పులకు ఫారం-8లు తీసుకుని మంచి ఓటరు జాబితా తయారు చేయాలని ఆదేశించారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు పరిశీలించి సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. ఓటర్ జాబితాలో తొలగించాల్సిన ఓటు ఉంటే జాగ్రత్తగా విచారణ చేసి స్పష్టమైన ఆధారాలు ఉంటేనే తొలగించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ జి.కె.శ్రీనివాస్ ఉన్నారు.

పాలఖండ్యాంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం



వృద్ధురాలికి నేత్ర పరీక్ష చేస్తున్న వైద్యులు

జి.సిగడాం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగించుకోవాలని ఎంపీడీవో కె.కృష్ణంరాజు అన్నారు. పాలఖండ్యాం గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. వైద్యులు రోగులను పరీక్షించి మందులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ధారబోయిన రెయిమ్మ, వైద్యులు డాక్టర్ బి.యశ్వంత్, నాయకులు ధారబోయిన ధర్మారాజ్, ఇజ్జి గోవిందరావు, మండల వ్యవసాయశాఖ డైరెక్టర్ రాయపురెడ్డి సూర్యనారాయణ, సూపర్ వైజర్ జి.భాస్కరరావు, హెచ్‌వీ రమాదేవి, హెల్త్ అసిస్టెంట్లు పేడాడ సత్తెరాజు, పొగిరి శేఖర్, సురేష్, రమేష్, కార్యదర్శి రాజా రమేష్, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ట్రాఫిక్ నియమాలు పాటించి ప్రమాదాల బారి నుంచి రక్షణ పొందాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. మంగళవారం న్యాయ సేవాసదన్‌లో ఎంపీఆర్ లా కళాశాల, అంబేద్కర్ యూనివర్సిటీలోని లా కాలేజీ విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనన, మరణ ధ్రువపత్రాలు, వివాహ రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్, ఆస్తుల రిజిస్ట్రేషన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శ్రీకాకుళం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి.వి.గంగాధరరావు ట్రాఫిక్ నిబంధనలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ రవికుమార్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జి.వెంకటరావు, జిల్లా పంచాయతీ అధికారి పి.వెంకటేశ్వరరావు, ఎంపీఆర్ లా కళాశాల ప్రిన్సిపాల్ కె.మోషే, ఎచ్చెర్ల లా కాలేజీ ఫ్యాకల్టీ టంకాల బాలకృష్ణ, న్యాయవాది గేదెల ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ కాలనీలో కల్చరల్ పార్కు ప్రారంభం



ప్రారంభోత్సవ శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కార్పొరేషన్ ప్రజలు ఎక్కడా ఇబ్బందులకు గురికాకుండా అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని డీసీసీబీ కాలనీలో రూ 16.84 లక్షలతో నిర్మించిన కల్చరల్ పార్కును మంత్రి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఒక్క అభివృద్ధి పని కూడా చేసిన దాఖలాలు లేవన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లలా భావించి పాలన సాగిస్తున్నామన్నారు. రూ.380 కోట్లతో ఫిషింగ్‌హార్బర్ ఏర్పాటుచేసి జిల్లాను అంతర్జాతీయ వ్యాపారాలకు అనువుగా తయారుచేస్తున్నామని చెప్పారు. కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఆస్పత్రి ప్రారంభించడం చరిత్రాత్మకమన్నారు. పవన్, చంద్రబాబులు విమర్శలు చేయడమే తప్ప ఒక్క మంచి పనైనా చేయగలిగారా అని ప్రశ్నించారు. ఉద్దాన ప్రాంతానికి మంచినీటి ప్రాజెక్టు ప్రతిపక్షాలకు కనిపించడం లేదా అని అన్నారు. మహిళా ఐఏఎస్ అధికారి కమిషనర్‌గా రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డి.పి.దేవ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, చల్ల శ్రీను, రాజేంద్రప్రసాద్, బీర్లంగి రామ్మోహన్‌రావు, చల్ల అలివేలుమంగ, టంకాల బాలకృష్ణ, పి.సుగుణారెడ్డి, పైడి మహేశ్వరరావు, కొండాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత వీఆర్‌ఓ మృతికి సంతాపం



గార: మండలంలోని కొర్ని గ్రామానికి చెందిన విశ్రాంత వీఆర్‌వో, ప్రముఖ రంగస్థల కళాకారుడు చౌదరి మన్మధరావు మృతి చెందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాల్లో అనేక నాటకాలను ప్రదర్శించి మన్ననలు అందుకున్నారు. ఈయన పార్థివదేహానికి కొర్ని సర్పంచ్, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ పీస గోపి, రామచంద్రాపురం సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి, ఎంపీటీసీ రుప్ప శ్రీనివాసరావులు మంగళవారం నివాళులర్పించారు.

పోలింగ్ కేంద్రాలకు జోనల్ అధికారుల నియామకం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని 28 గ్రామ సచివాలయాల పరిధిలో 90 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను తొమ్మిది మంది జోనల్ అధికారులను నియమించారు. ఈ అధికారులు తమ పరిధిలో పోలింగ్ కేంద్రాలకు సంబంధించి పూర్తి వివరాలు అధికారులకు అందజేయాల్సి ఉంటుంది. సమస్యాత్మక, అతిసమస్యాత్మక, గతంలో ఎన్నికల నిర్వహణ పరిస్థితి వంటి పూర్తి నివేదిక అందజేస్తారు. ఈ నివేదిక ఆధారంగా అధికారులు ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకుంటారు. అధికారుల ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు తహసీల్దార్ శ్యాంకుమార్ తెలిపారు.

దశలవారీగా ఉద్యోగాల కల్పన



ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు చెబుతున్న యువకులు

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గంలో నిరుద్యోగులకు దశలవారీగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమంలో ఇటీవల ఉద్యోగాలకు ఎంపికై న ఐదుగురు యువకులు మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మంగళవారం కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఉద్యోగాలను సక్రమంగా చేసుకోవాలని వారికి ఎమ్మెల్యే సూచించారు.

సమ్మె విజయవంతం చేయాలి



పైడిభీమవరంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

రణస్థలం: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 16వ తేదీన నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని ఆరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్ కోరారు. పైడిభీమవరం పంచాయతీలో కార్మిక వర్కర్ల యూనియన్, ప్రజా సంఘాలు సమ్మె, గ్రామీణ బంద్‌పై మంగళవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. అలాగే పైడిభీమవరంలోని పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, జీతాలు పెంచాలని అధికారులకు వినతి పత్రం అందజేశారు.

గాయత్రీ కాలేజీలో విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని మునసబుపేటలో గురజాడ విద్యాసంస్థల అనుబంధమైన గాయత్రీ కళాశాలలో 300 మంది విద్యార్థులు రక్తదానం చేసేందుకు ముందుకు రావడం హర్షనీయమని ఇండియన్ రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. మంగళవారం స్థానిక విద్యాసంస్థలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో రక్తం కొరత ఎక్కువగా ఉందన్నారు. రక్తదానంపై అపోహలు వీడి ప్రతిఒక్కరూ రక్త సేకరణకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో గురజాడ విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు, ప్రిన్సిపాల్ పులఖండం శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్, రెడ్‌క్రాస్, గురజాడ విద్యాసంస్థల సిబ్బంది న్నారు.

రాజేష్‌కు మంత్రి బొత్స సన్మానం



రాజేష్‌ను సన్మానిస్తున్న విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జేఎన్‌టీయూజీవీ గర్ల్స్ హాస్టల్, సివిల్, మెకానికల్ ల్యాబ్‌లను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మంగళవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా జేఎన్‌టీయూజీవీ సిండికేట్ మెంబర్‌గా నియమితులైన డాక్టర్ బుడుమూరు రాజేష్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా రాజేష్ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, వైస్ చాన్సలర్ వెంకట సుబ్బయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయసుమ పాల్గొన్నారు.

శ్రీకాకుళం న్యూకాలనీ: జేఎన్‌టీయూ విజయనగరం పాలకమండలి సభ్యుడు దుప్పల వెంకటరావు మంగళవారం యూనివర్సిటీలో జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి బొత్స సత్యన్నారాయణ చేతులమీదుగా సత్కారం అందుకున్నారు. విద్యాసంస్థలను నెలకొల్పడంతో అనేక సామాజిక, సాంఘిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో తనదైన ముద్ర వేసి గుర్తింపు పొంది జేఎన్‌టీయూ పాలకమండలి సభ్యునిగా ఇటీవల నియామకమైన విషయం తెలిసిందే.

గాయత్రీదేవికి అష్టోత్తర పుస్తకార్చన



శ్రీకాకుళం కల్చరల్: గుంటూరు జిల్లా చౌడవరం దాసరిపాలెంలో గాయత్రీ దేవాలయంలో అష్టోత్తర పుస్తకార్చన నిర్వహించినట్లు కాశిని వేంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వజయం పిల్లల శ్రేయస్సు కోసం కాశిని వేంకటేశ్వరరావు, రమణమ్మ దంపతులు స్వీయ రచన 'శ్రీవేద జనని గాయత్రి'ను 108 పుస్తకాలతో అర్చన జరిపించి బుధవారం శ్రీపంచమి సందర్భంగా భక్తులకు ఉచితంగా వితరణ చేసేందుకు ఆలయ ధర్మకర్త రామిరెడ్డికి అందజేశారు. దేశంలోని పురాణ ప్రసిద్ధ, విభిన్న రూపాల్లోని 108 గాయత్రీ ఆలయాల విశేషాలను పుస్తకంలో పొందుపరిచారు.

వేణుగోపాలస్వామికి పూజలు

జి.సిగడాం: సంతవురిటి గ్రామంలోని వేణుగోపాలస్వామి దేవాలయం పునఃప్రతిష్ట మహోత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. వేద పండితుల ఆధ్వర్యంలో భక్తులు పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త బాలబొమ్మ శ్రీనివాసరావు సమక్షంలో హోమాలు చేశారు.

సరోజినీ నాయుడుకు ఘనంగా నివాళి



గ్రంథాలయంలో సరోజినీనాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం గ్రంథాలయంలో స్వాతంత్ర్య సమరయోధురాలు సరోజినీనాయుడు 145వ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఆ రోజుల్లో విద్యకు, ఇంగ్లిష్ భాషకు, ప్రజాసేవకు ఇచ్చిన ప్రాధాన్యతను గ్రంథాలయ అధికారి మలిపెద్ది చంద్రశేఖర్ విద్యార్థులకు వివరించారు. అసిస్టెంట్ లైబ్రేరియన్ సూర్యనారాయణ ఉన్నారు.

జాతీయ పోటీల్లో సత్తా చాటండి



క్రీడాకారులతో మధుసూదన్, అథ్లెటిక్స్ సంఘ ప్రతినిధులు, పీఈటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయస్థాయి అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చి పతకాలతో తిరిగిరావాలని అథ్లెటిక్స్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు పిలుపునిచ్చారు. ఈ నెల 16 నుంచి 18 వరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 19వ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులు మంగళవారం పయనమై వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల వద్ద ఉన్న జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయంలో జరిగిన వీడ్కోలు కార్యక్రమానికి మధుసూదనరావు హాజరై శ్రీ స్పోర్ట్స్ కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎన్.విజయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి ఎం.సాంబమూర్తి, కె.మాధవరావు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బి.వి.రమణ, టి.శ్రీనివాసరావు, టి.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు. కాగా జిల్లా బృందానికి మేనేజర్లుగా సమగ్రశిక్ష పీఈటీలు ఇ.అప్పన్న (కె.కె.రాజపురం), గణేష్ (జలంతరకోట) వ్యవహరించనున్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి




జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల వద్ద హెల్మెట్ ధారణ అవగాహన ర్యాలీ ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం వల్లే అత్యధిక మరణాలు సంభవిస్తున్నాయని చెప్పారు. యువత ర్యాష్‌డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం కూడా ప్రమాదాలకు కారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, నేషనల్ యూత్ ఫౌండేషన్ సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

16న బార్ అసోసియేషన్ సమావేశం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్- 22కు వ్యతిరేకంగా జిల్లా బార్ అసోసియేషన్ న్యాయవాదుల సమ్మెపై లాయర్ల అభిప్రాయాల సేకరణకు జిల్లా బార్ అసోసియేషన్ భవనంలో జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయం మేరకు ఈ నెల 16న న్యాయవాదుల అత్యవసర సమావేశం నిర్వహించనున్నామని బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ చక్రధర్

శ్రీకాకుళం: ఐఐటీ జేఈఈ మెయిన్స్-2024లో మంగళవారం విడుదలైన ఫలితాల్లో శ్రీకాకుళం చక్రధర్ కళాశాలలో చదువుతున్న 17 మంది విద్యార్థులు సత్తాచాటారని కళాశాల చైర్మన్ యాళ్ల చక్రధర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కళాశాలలో నిట్ సీట్లు సాధించిన విద్యార్థులను అధ్యాపకులతో కలిసి అభినందించారు.

ఏబీసీ సెంటర్ పరిశీలన



ఏబీసీ సెంటర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కుక్కల నియంత్రణ శస్త్రచికిత్సలు చేస్తున్న ఖాజీపేట ఏబీసీ సెంటర్‌ను మున్సిపల్ కమిషనర్ తమీమ్ అన్సారియా మంగళవారం పరిశీలించారు. కుక్కల నియంత్రణకు చేపడుతున్న చర్యలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ వెంకటరావు, పశుసంవర్థకశాఖ ఏడీ కృష్ణారావు, ఎస్‌పీసీఏ మెంబర్ రమణమూర్తి, స్నేహ పాల్గొన్నారు.